అశోక

మాలతీ బేగం

"ఏమిటి కేడ్చెద వానన
తామరసం బెత్తిచూడు తరుణీ నన్నున్
గోముల కటాక్ష వీక్షా
దామకముల రఘురాముయ్య
తనయున్ లక్ష్మీపతిన్"

"పోండి....మరీ చిన్నపిల్లలైపోతున్నారు! వదలండి—అబ్బబ్బా!"

"మరేం చేయమంటావు రాధా? సాయంత్రం ఎప్పుడౌతుందా అని చూస్తుంటాను. ఆఫీసులో శరీరం, రాధ దగ్గర మనస్సు—ఊఁ సరేగాని నీ వెందుకేడుస్తున్నావో చెప్పు? ఈ సంపెంగ

పూవు నీ జడలో ఎలా పెట్టానో చూడు....ఆహా....గూటిలో రామ చిలకలా గుంది."

"......................"

"చెప్పు రాధా? నీవు కన్నీరు కారుస్తే నే చూడలేను-పండక్కి మీ ఊరు వెళ్ళవద్దన్నానా?"

"ఇంకా నయం చాక్లెట్స్ తేతే దనా? అన్నారు కాదు."

"నువ్వు కాదు రాధా-నిజంగా చెప్పు నీకేం లోటో! ఈ ఊరు బాగుండదనా?"

"...................."

"అసలీ ఊరు నీకిష్టం లేదన్నావు మొదట్లోనే. ముక్కోటి ఆంధ్రులను ఆకర్షించే ఈ భాగ్యనగరం నిన్ను ఆకర్షించ లేదంటే నిజంగా ఇది అభాగ్య నగరమే అని చెప్పాలి! నాకీ ఊళ్ళో ఉద్యోగం వచ్చిందని నేనెంతో సంతోషించాను. షికార్లతో సినిమాలతో ఆనందంగా గడపవచ్చనుకొన్నాను. నీవేమో ఎక్కడికీ రానంటావు."

* * *

పెరట్లో పడక్కుర్చీలో పడుకున్న కుటుంబరావు మనస్సు చలించింది. ఏదో తనకు తెలియని శక్తి అతన్ని కృంగతీస్తోంది. ఏవేవో ఆలోచనలు. మనస్సంతా భారంగా ఉంది. తన పెళ్ళైనప్పటినుంచీ ఎప్పుడైనా ఒక రోజన్నా భార్యతో అలా కబుర్లు చెప్పుతూ గడిపాడా? కారణం తల్లి తండ్రీ, గంపెడు తోబుట్టువులతో ఇల్లంతా ఏనుగు కలచిన కొలనులా గుండేది-ఎప్పుడూ! ఇప్పుడో? అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. అయినా తనకి సుఖంలేదు. సుశీల ప్రొద్దున పదింటికి పోయి సాయంత్రం ఆరుగంటలకి ఇల్లు చేరుకొంటుంది. కాళ్ళీడ్చుకొంటూ ఉసూరుమంటూ వాడిపోయిన ముఖంతో ఎదురౌతుంది. ఆ స్థితిలో చూస్తే ఇక సుశీలతో ఏమీ మాట్లాడలేడు. పాపం పొద్దస్తమానం



పైపు యంత్రంతో కుస్తీపట్టిన చేతులు అలసిపోయి ఇం కేపనీ చేస్తాని కంగీక రించవు. యంత్రానితో మైత్రి చేసి సుశీల మనస్సు కూడా యంత్రమై పోయింది. పోనీ ఉద్యోగమన్నా మాన్పించేద్దా మంటే గడవటం కష్టం. తన జీతమైతే పది రూపాయలన్నా పెరగలేదు కాని సంసారం మాత్రం నలుగురు పిల్లలతో ఇట్టే పెరిగి పోయింది. దేవుడు దయామయి. వద్దన్నా సంతానభాగ్యం కలిగిస్తాడు అనుకున్నాడు కుటుంబం.

''ఏరా? కుటుంబీ! ఫ మాలో చిస్తున్నావ్? నీ పేరుకు తగ్గట్టు ఎప్పుడూ కుటుంబాన్ని గురించే ఆలో చిస్తుంటావా? ఎప్పటి నుంచో గేటు శబ్దం చేస్తున్నా, వినిపించలేదా?'' అంటూ లోని కొచ్చిన భాస్కరాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు కుటుంబరావు.

''భలే ఊహించావే? నిజంగా కుటుంబాన్ని గురించే ఆలోచిస్తున్నా నురా! ఎంతైనా సి. ఐ. డీ. ఆఫీసరుగా మరి. మనస్సులోని మాటలు కూడా చెప్పటం నేర్చుకొన్నా వన్నమాట.''

''అది సరేగాని, నీ పేరన్నా మార్చుకో, లేకపోతే బడిపంతులు ఉద్యోగమన్నా మానుకో. ఈ రెండూ కలిసి నిన్ను మరీ పిచ్చోడిగా చేసేస్తు న్నాయి. కుటుంబం– బడిపంతులూ – ప్రయివేటు పిల్లలూ – ఈ మూడు మాటలు తప్ప నీ డిక్షనరీలో వేరే మాటలే లేవు.''

''ఉష్....విను విను .... ఆ నవ్వు చూడు ఎంత మధురంగా ఉందో....''

''ఏదీ? ఎక్కడ? కనిపించుటలేదే!– ఎలా చూడను?''

''పోరా?....నీదంతా చాదస్తం... వినమంటే.''

* * *

''చూడు రాధా–ఈ పదిచీరల్లోంచి ఏదన్నా ఒకటి కట్టుకో. ఈ ఎఱ్ఱచీర ఈ నల్లజాకెట్టు నీ కెంతో అందంగా ఉంటుంది. కెందామరలా గుంటావు. లేలే.... లేమరి టైమ్ అయిపోతోంది.''

''అబ్బబ్బా....ఉండండి....మరీ ను చిన్న పిల్లలై పోతున్నారు. అయ్యయ్యో పడిపోతా నండి....ఏం టలా ఎత్తేస్తారు పైకి.''

''లేవకపోతే ఏం చేయమంటావు చెప్పు? మోటర్ సైకిల్ గాని కారు గాని చెడిపోతే దాన్ని కాస్త తోసి వదుత్తే అది స్టార్ట్ అవుతుంది. చూడు నీవు డ్రెస్ వేసుకొచ్చేలోగా ఈమల్లెల్ని సూదితో గుచ్చేస్తాను..ఊఁ, కదులూ!''

* * *

''కూర్చో – కూర్చో నీ వెందుకు లేస్తున్నావు. మరీ ఇంత రియాక్షన్ అయితే ఎలా'' అన్నాడు భాస్కర్ కుర్చీలోంచి పైకి లేవబోతున్న కుటుం

జాన్ని భుజాలు పట్టి కూర్చోబెడుతూ.

కుటుంబరావు సిగ్గుపడ్డాడు.

"ఏం చేయమంటావురా-భాస్కర్! మనం అనుభవించనివి ఇంకొకరు అనుభవిస్తున్నప్పుడు చూసేవాళ్ళకేలా గుంటుం దంటావు."

"ఏమిరోయ్? మనం మనం అంటూ మొదలెట్టావు. నాకింకా కుటుంబం లేద్రోయ్ కుటుంబంభాయ్."

"సరేగాని భాస్కర్"

"ఉ....ఏమిటీ కుటుంబం"

"చూడు నే నేమో సీరియస్‌గా చెప్తాను. నీ వేమో చాల లైట్‌గా తీసికొంటావు. నీ కంతా నవ్వులాటగా ఉంటుంది కదూ? ఎన్నిరోజు లిలా అడవికాచిన వెన్నెలవలే నీ యవ్వనాన్నంతా వృథా చేసుకొంటావు. నా మాట విని తొందరగా పెళ్ళిచేసుకో."

"నీ యవ్వనం అంతా పెరట్లో కాస్తోంది. పోనీ నాదాన్నన్నా అడవిలో ఉండనీ."

"అదే వద్దనేది. ఏది చెప్పినా నీకు నవ్వులాటగా ఉంటుంది."

* * *

"రాధా....ఓ....రాధా...."

"ఏమిటండీ ఆ గావుకేకలు. మెల్లగా పిలవలేరా?"

"అసలు నీవు పలికితేగా! పలకనప్పుడు గట్టిగా పిలవ్వాలసివస్తుంది."

"నా పేరు రాధైతేగా మీరు పిలవగానే పలకడానికి."

"అదిగో! ఎన్నిసార్లు చెప్పినా మళ్ళీ అదేమాట. వరాలు అంటే ఏం బాగుంది చెప్పు. చాల పాత పేరులాగుంది. వరాలు, నూకాలు, నాగులు, నాంచారమ్మ, తాయార్లు ఇవన్నీ ఔట్ ఆఫ్ ఫేషన్. నాకు నచ్చిన పేరు రాధ, ఏం. రాధ అని పిలుస్తే పలక్కూడదా?"

"సరే .... సరే .... మాటల్లో నే టైమ్ అయిపోతోంది....సినిమా మొదలెట్టేస్తారు."

"ఊ....ఇదిగో మల్లెపూల దండ. తొందరగా పెట్టుకో – అబ్బో అబ్బో ఎందు కంత నవ్వు? చెప్పితే నేనూ సంతోషిస్తాగా."

"అదేంటి అలా గుచ్చావు, ఒకటి కాడలోంచి ఇంకొకటి మొగ్గలోంచి, కొన్ని కాడలు పైరుగా, కొన్ని మొండిగా....బాగుండదండీ; ఇది పెట్టుకొంటే ఎవరన్నా నవ్వగలరు."

"ఎవరూ నవ్వరు – నీవే నవ్వుకుంటున్నావు కానీ....కానీ తలుపులన్నీ వేసుకొని రా, నేను స్కూటర్ బైటికి తీస్తా."

* * *

కుటుంబరావూ, భాస్కర్ చెవులు రిక్కించి వింటున్నారు. వాళ్ళ సంభా

షణలబట్టి వాళ్ళ సంగతులు ఒక్కొక్కటీ తెలుస్తున్నాయి కుటుంబరావుకి. ఒకటి రెండుసార్లు ఆమెను చూసాడు. కాని పూర్తిగా చూడలేక పోయాడు. వెనకనుంచో, పక్కనుంచో చూశాడు. ఆ చూసిన కొద్ది రూపాన్నిబట్టి ఆమె అందగత్తె అని ఊహించాడు కుటుంబం. భాస్కర్ కూడా ఎటో ఆలోచిస్తూ మౌనంగా కూర్చున్నాడు. తలుపులు వేసిన శబ్దం, స్కూటర్ కదలిన శబ్దం ఇద్దరూ విన్నారు. అదృష్ట దంపతు లనుకొన్నాడు కుటుంబం; ఆదర్శ దంపతు లనుకొన్నాడు భాస్కర్. కుటుంబం చేతి కున్న వాచీ చూశాడు. ఆరున్నర కావస్తోంది. ఇంకా సుశీల రాలే దని బాధపడ్డాడు. పిల్లల్ని ఆడిస్తానికి తీసికెళ్ళిన ఆయాకూడా తిరిగి వచ్చేసింది. నలుగురు పిల్లల్ని ఆడించలేక సతమతమౌతోంది. పాపం పొద్దస్తమానం ఎలా చూస్తుందో పిళ్ళని! పదిహేను రూపాయలకోసం ఇంత కష్టపడుతుం దన్నమాట! తనో-తనూ అంతేగా నూట యాభై కోసం యాభై మంది పిల్లలకి చదువు చెప్తున్నాడు. ఎవరికి తగ్గకష్టం వాళ్ళకి అనుకొన్నాడు కుటుంబం.

''వస్తావా — కుటుంబం. అసలు వచ్చినపనే మర్చిపోయాను - చూడు రేపు సండే పిక్నిక్ ఏర్పాటు చేస్తున్నాను. నీవూ — సతీమణితో సహా రావాలి! పక్కింటివాళ్ళ మైకంలో పడి ఎందుకు కొట్టుకొంటావు. నీవూ అంతకంటే పదిరెట్లు అనుభవించవచ్చు'' అన్నాడు భాస్కర్ కుర్చీ లోంచి లేస్తూ.

''ఏమో! నన్నడిగితే ఎలా? సుశీలను అడగాలి. ఆమెగారికి సండే డ్యూటీ ఏమన్నా పడిందో ఏమో మరి'' అన్నాడు కుటుంబం విసుగ్గా నిట్టూర్పు వదుల్తూ.

''ఓహో....సుశీల అనగానే సుశీల వచ్చేసింది — నూరేళ్ళు ఆయుస్సు'' అన్నాడు భాస్కర్ అప్పుడే లోనికొచ్చిన సుశీలను చూసి.

''ఎందుకు బాబూ నూరేళ్ళు నూట పదిహేళ్ళను! ఈ కష్టాలతో నూరేళ్ళు జీవించాలనా మీ ఉద్దేశ్యం'' అంది సుశీల చెప్పులు మూలపెట్టి పర్సూ టిఫిన్ బాక్సు బల్లపై పెడుతూ నవ్వి.

''ఏం, ఆలస్యమయిందేం?'' కాస్త కఠినంగానే ఉంది కుటుంబరావు అడిగిన ధోరణి. సుశీల భాస్కర్లు నిర్ఘాంతపోయారు.

''ఈ రోజు ఈవినింగ్ డ్యూటీ పడింది—అదీకాకుండా ఏదో అర్జంట్ వర్కుంటే చేసి వెళ్ళమన్నాడు మానేజర్'' అంది సుశీల ఆశ్చర్యంనుంచి తేరుకొని.

డ్యూటీ మాట వినగానే చల్ల

"ఏమండీ! ఈ రోజు చీరలు తెచ్చుకోవాలి! ఓ వంద రూపాయలు ఇచ్చిపోండి.''
"అడిగేప్పుడు కొంచెమైనా జ్ఞానంవుండాలి. ఆఫీసుకు పోబోయేముందేనా నీకు తీరింది?"
"మీకు లేంది నా కెక్కడనుంచి వస్తుందీ!"

పడ్డాడు కుటుంబం. తొందరపడి అడిగినందుకు లోలోన బాధపడ్డాడు.

''పంతులు బుద్ధి పోనిచ్చావుకాదు. చిన్నపిల్ల నడిగినట్లు ఏమి టలా గదమాయిస్తావు? మూవా డీమధ్య కొత్తగా వచ్చిన పక్కింటి నూతన దంపతుల ప్రేమరసాన్ని చవిచూస్తున్నాడు. సుశీలా! తత్ఫలితమే ఈ చిరాకు, చింతాను. నీ వేం అనుకోకూ - అసలు సంగతది. ఇక వెళ్ళివస్తాను! చూడమ్మా, రేపు సండే పిక్నిక్ ఏర్పాటు చేశాను, మీ రిద్దరూ తప్పక రావాలి! ఏమంటారు?'' అన్నాడు సుశీలవైపు తిరిగి భాస్కర్ ప్రశ్నార్థకంగా.

చూద్దాం. సండే ఇక మూడురోజు లుందిగా!'' అంది సుశీల నవ్వుతూ.

భాస్కర్ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

* * *

ఆ రాత్రి ఇద్దరూ మౌనంగానే ఉన్నారు. భాస్కరం ఎదుట తనని అలా అడిగినందుకు సుశీల చాల బాధపడింది. తొందరపడి అడిగినందుకు కుటుంబం లోలోన బాధపడుతున్నప్పటికీ పైకి మాత్రం కోపం నటిస్తూ

గంభీరంగా ఉన్నాడు. 'సుశీల తనతో పాటు ఉద్యోగం చేస్తూ తనకంటే ఎక్కువే బాధ్యతలు నిర్వహిస్తున్నా తన భార్యగా, తనకు లొంగి ఉండాలి కదా ? తనేమన్నా పడాలి ! ఇప్పుడు కోపమొచ్చేటంత పెద్దమాట ఏమన్నా నని సుశీలకు అంత అభిమానం ? సుశీల పలకరించేవరకు తను మాట్లాడకూడ' దనుకొన్నాడు కుటుంబం.

'పగలంతా ఆఫీసులో కష్టపడి ఇంటికి రాగానే సానుభూతి చూపవలసిందిపోయి ఇంకా పైగా భాస్కర్ ముందు అవమానపర్చాడు. చిన్నపిల్ల నడిగినట్లు అడిగేసాడు. పోనీ ఎవరూ లేనప్పుడైతే పర్వాలేదు కాని ఒకరి ఎదుట భార్యని అలా చులకన చేసి మాట్లాడటం సమంజసంగా ఉందా ? తను కావాలని ఊసుపోకకు ఉద్యోగం చేస్తోందా ? భర్త అనుమతితోనే ఉద్యోగం చేస్తోంది ! సాయంత్రం కాగానే ఇంటికి రావాలని ఉండదా తనకు ? వారంటే బడిపంతులు గనుక నాల్గున్నరకి ఇంటికి రాగలరు. తనెట్లా రాగలదు ? వారే ఏదైనా ఆఫీసులో పని చేస్తూ ఆలశ్యంగా వస్తే అలా అడగ్గలదా తను ? అన్నిటిలో సమాన హక్కు లంటారు కాని ఆ బానిసత్వపు గుణం ఇంకా పూర్తిగా నశించలేదు. తప్పంతా తనదే ! ఇంకా పైగా మాట్లాడకుండా ఎడమొఖం పెడమొఖంగా ఉన్నారు. తనేం తక్కువ తిందా ? వారే ముందు పలుకరించే వరకు తనసలు మాట్లాడకూడ' దనుకొంది సుశీల.

సుశీల ఇంట్లో అడుగు పెట్టిన సమయం ఎటువంటిదో ఏమో కాని ఆ రాత్రి ఇద్దరూ సాయంత్రం జరిగిన సంఘటనతో లోలోన చాల బాధ పడ్డారు. ఇద్దరికీ అభిమానం అడ్డు వచ్చింది. ఏం, తనూ సంపాదిస్తోందిగా. కాస్త ఆలశ్యంగా రాకూడదా ? అని సుశీల, ఏం, తను భార్యగా తన కర్తవ్యాన్ని నేరవేర్చకూడదా ? భర్తకు కోపం వచ్చి ఏమన్నా అంటే అంత కోపంగా ఎందుకుండాలి ? భర్తంటే ఆమాత్రం గౌరవం లేదా ? అని కుటుంబం అనుకొన్నారు.

* * *

పాలవాడి కేకకి పాల గిన్నెతో బైటికొచ్చిన సుశీల పక్కంటి రాధను చూసి నిర్ఘాంతపోయింది. లక్ష్మి !.... వరలక్ష్మి ! .... ఆనాటి వరలక్ష్మి ! లోకుల, పోట్లతో గాయపడిన హృదయంతో తిరిగి వెళ్ళిపోయిన వరలక్ష్మి ! తన భర్తకూ తనకూ పునస్పర్ధలు కలగటానికి కారకురాలైన వరలక్ష్మి ! తోబుట్టువుకంటే ఎక్కువ ఆదరించిన వరలక్ష్మి ! మళ్ళీ ఈ ఊరు ఇంత పెద్ద హోదాలు గల భర్తతో వచ్చిందా ? మళ్ళీ ఆ లక్ష్మి తన సంసారంలో

అశాంతికి కారకురాలా ? సుశీల కళ్ళు చెమ్మగిల్లాయి. అంతా దేవుని మహిమ!

రాధను చూసిన సుశీల కళ్ళు గతాన్ని గుర్తుచేసుకో!' అంటూ సుశీల మనస్సును ప్రేరేపించాయి.

* * *

"సుశీలా ! నీ కెన్నిసార్లు చెప్పాను, ఇల్లు ఖాళీ చేయమని చెప్పమంటే విన్నావా ? నన్నసలు ఈ ఊళ్ళో తలెత్తుకొని తిరగనిస్తావా ?" అంటూ గదమాయించాడు కుటుంబం బడి నుంచి వస్తూ.

"అదేంటండీ ? అలా అంటారు !"

"అసలు—దాంతో ఏంటి నీకు—స్నేహం ? ఎంత చెప్పినా వినకుండా నీ మాట నీదే అంటావు."

"అదికాదండి, లక్ష్మి సాక్షాత్తు లక్ష్మే ? చాల మంచిది. లోకులంతా అలా అనుకొంటున్నారంటే నాకు చాల ఆశ్చర్యంగా ఉంది !"

"ఉంటుంది ? ఉంటుంది ? ఉండదు మరి. రేపు నిన్ను గురించి కూడా అలా అనుకొంటే నేనేం విషమో తీసుకొని చావవలసొస్తుంది."

"అబ్బబ్బా — ఊరుకోండి బాబు. ఏంటా మాటలు సంధ్యవేళ."

"అదికాదు సుశీల-చూడు, రోజుకు ఎంతమంది వస్తుంటారో ! అసలు మనకైనా బాగుంటుందంటావా ? వాళ్ళంతా అలా రావటం. వంటరిగా ఉంటూ ఉద్యోగంచేస్తున్న అమ్మాయి ఇంటికి రోజుకు పదిమంది వస్తూపోతూ ఉంటే లోకులూరుకొంటారా ? చెప్పు ? మంచిదని నీ వంటావు. కాని అందరూ అనగలరా ?"

"ఏమండీ, పదిమంది వస్తే తప్పా? తెలిసినవాళ్ళంటే రారా ?"

"అదిగో అదే వద్దనేది. తప్పో ఒప్పో. చూసేవాళ్ళకది బాగుండదు. అంతా నన్నంటున్నారు అలాంటమ్మాయికి ఇల్లెలా ఇచ్చావయ్యా అని."

ఏమోనండి, ఏం లోకులో! ఎవరన్నా బాగుంటే చూడలేరు. చదువుకొని ఉద్యోగం చేస్తూ సుఖంగా కాలం గడిపేవాళ్ళని చూసి కన్నుకుట్టి ఏవేవో లేవదీస్తారు. పెళ్ళి చేసుకొని సంసార భారాన్ని మోయలేక బాధ పడుతున్నవాళ్ళని చూసి సానుభూతి చూపిస్తారు. ఈ లోకులింతే. స్థిమితం లేనివాళ్ళు. దారం తెగేదాకా లాగి తెగిపోయాక అంతా చుట్టు చేరి సానుభూతితో పిచ్చిపిచ్చి సలహాల నిస్తారు."

"అదంతా సరేకాని రేపు ఫస్టున మన ఇల్లు ఖాళీచేయమని చెప్పు. ఇంకెక్కడైనా చూసుకొంటుంది. లేదంటావా, నేనే చెప్పేస్తాను"

సుశీలమనస్సు బాణాలతో పొడిచినట్లైంది కుటుంబరావు మాటలు విని. ఏమిటి! ఇదీ ఒకసంఘమేనా ? చదువుకొని ఉద్యోగం చేస్తూ ఆడది వంటరిగా

ఉండటం తప్పా? అయినా లక్ష్మి ఇప్పుడంత తప్పుపని ఏం చేస్తుందని! ఒంటరిగా ఉంటున్న ఒక అమ్మాయికి ఇల్లు అద్దెకివ్వటం కూడా తప్పా? అయినా ఇప్పుడీ సంగతి లక్ష్మితో ఎలా చెప్పేది. ఇల్లు ఖాళీ చేయమంటే ఎందుకని అడగదూ? పాపం ఒంటరిగా ఎక్కడికి పోతుంది? ఈ పరిస్థితిలో ఆమెకు ఇల్లెవరైనా ఇస్తారా? హాస్టల్లో ఆహారం సరిపడక ఈ ఇల్లు చూసుకొని ఉంటోంది. లక్ష్మికి ఈ నింద తగిందా? ఛీ....ఛీ....పాపం. ఇంత మంచిలక్ష్మికి ఈ నిందేమిటి? దయామయి, ఎవరన్నా కష్టాల్లో ఉంటే చూస్తూ ఊరుకునే స్వభావం కాదు ఆమెది. ఆమె మంచితనాన్ని, పరోపకారాన్నీ, చూసి ప్రతి ఒక్కరూ ఆర్థిక సహాయంకోసం వస్తుంటారు. ఆఫీసు ప్యూన్ దగ్గరనుంచి కజిన్ బ్రదర్ దాక లక్ష్మిదగ్గర సహాయం పొందే వారేకదా! ఇంతటి ఉదాత్తమైన స్వభావం గల లక్ష్మికి ఈ లోకుల నిందలేమిటి? మంచి చేస్తే చెడు ఎదురా? తన ఇంటికొస్తున్న ప్రతిఒక్కరిగురించి చెప్పుతుంది లక్ష్మి. అందులో ఒకటీ తనకు అసమంజసంగా కనిపించలేదే! ఈ ఊరొస్తున్న ప్రతిఒక్కరినీ వాళ్ళ నాన్న మా అమ్మాయిని చూసిరండని పంపిస్తాడట. అదీకాక లక్ష్మికి వాళ్ళ వూరివాళ్ళుగాని చుట్టాలుగాని ఎక్కడైనా కనిపిస్తే చాలు 'మీ యింటికొస్తాం ఎక్కడుంటారు?' అని అడుగుతారట! మరి అలాంటప్పుడు వద్దు మా యింటికి రావద్దని ఎవరనగలరు! ఊరు చూస్తానికొచ్చిన వాళ్ళు, ఇంటర్వ్యూకొచ్చినవాళ్లు ప్రతిఒక్కరూ వస్తుంటారు లక్ష్మిదగ్గరకు. చాలామంది చుట్టాలుండటంకూడా తప్పా?

లక్ష్మితో ఏమని చెప్పాలి? ఎలా చెప్పాలి? చెప్పకపోతే వారే చెప్పేస్తారట! అసలే ఆవేశ మెక్కువ ఈ మనిషికి. ఒకటికి రెండన్నారంటే నవనీతంలాంటి లక్ష్మి హృదయం ఎంత గాయపడుతుంది?'' ఈ విధంగా ఆలోచిస్తూ సుశీల రాత్రంతా జాగారం చేస్తూ గడిపింది.

అతికష్టం మీద తెల్లవారింది. రాత్రంతా నిద్రలేని కారణాన కళ్లన్నీ ఎర్రగా వాచిపోయి ఉన్నాయి. విధిగా గృహకృత్యములు నెరవేర్చి భర్తకు అన్నంపెట్టి బడికి పంపింది. ఆ రోజు శుక్రవారం! సుశీలకు ఏదో తప్పు చేస్తున్నట్లనిపించింది. తలంటు పోసుకొని పూజచేసిన పూలూ పండ్లూ తీసుకొని లక్ష్మిదగ్గరకు వెళ్ళింది.

''లక్ష్మి ఇవిగో ఈ పూలూ పండ్లూ తీసుకో'' అంది లక్ష్మికి పూలందిస్తూ,

''అదేం టక్కా! మీరేమో లక్ష్మి అంటారు. ఇంకొకరు వరాలూ, ఒకరు వరలక్ష్మి, నాన్నగారు వజ్రం అంటారు.

ఏమిటి అక్కా అలాగున్నారేం? వంట్లో బాగుండలేదా?'' అంది వరలక్ష్మి పూ లందుకొంటూ నవ్వి.

''చూడమ్మా నీ కోమాట చెప్తాను. ఏమీ అనుకోవు కదూ?''

''ఏం అనుకొంటా నక్కా? నీ మాట కంటే నాకు ఎక్కువేముంది చెప్పు? నీ మాట ఎప్పుడైనా కాదన్నానా?'' అంది లక్ష్మి సుశీలను చూస్తూ.

* * *

అంత ఉత్సాహంగా ఉండే లక్ష్మితో లోకుల నింద లన్నీ చెప్పి ఆమె ఉద్యోగాన్ని మాన్పించి ఈ ఊరునుంచి పంపింది తనే! శుక్రవారంనాడు లక్ష్మిని వెళ్ళిపొమ్మంది. అలాగే ఆ లక్ష్మితోపాటే తనింట్లో లక్ష్మికూడా పోయింది. ఏ ఇంట్లోనించైతే లక్ష్మిని పొమ్మందో ఆ ఇల్లే తననుంచి వేరయింది. అప్పులకింద ఆ ఇల్లుకాస్తా పోయింది. భర్త తెచ్చే డబ్బులు చాలక తనూ ఉద్యోగంలో చేరవలసివచ్చింది. లక్ష్మి వెళ్ళినప్పటినుంచీ తన జీవితమే మారిపోయింది. ఎన్నటికీ మరపురాని ఆ నాటితో తన సంసారం తీరే మారిపోయింది. కలలోకూడా అనుకోలేదు, ఇన్ని కష్టాలొస్తాయని, తను ఉద్యోగం చేయవలసొస్తుందని? ఆనాడు పనిరాని సలహా లిచ్చినవాళ్ళు ఈనాడేం చేస్తున్నారు? కష్టాల్లో ఉంటే ఆదుకోగలిగారా? ఒక్క వందరూపాయలు అప్పు పుట్టాయా ఎక్కడైనా ఒకనాడు లోకులచేత నిందలు మోసి: లక్ష్మి ఇప్పుడు భర్తతో అదీ పెద్ద హోదాలోగల భర్తతో వస్తే ఎంత గౌరవం! పాలగిన్నెతో లోనికొస్తూ,

''ఏమండీ .... మన లక్ష్మినండీ .... వరలక్ష్మి. అదే వరాలు.... రాధ — మన పక్కింట్లోని రాధ'' అంది సుశీల పందుంపుల్లతో ముఖం కడుక్కొంటున్న భర్త నుద్దేశించి

''ఆ .... ఆ .... లక్ష్మి .... రాధే.... వరలక్ష్మి ...'' అంటూ నోరు తెరిచి అలాగే ఉండిపోయాడు; తను నిర్మించుకొన్న వూహాసౌధంలోంచి రాధను ఎత్తి నేలకేసి కొట్టాడు కుటుంబం. రాధను గురించి ఎంత గొప్పగా ఊహించాడు. ఆ రాధే అప్పటి లక్ష్మి?

నల్లగా దట్టంగా వ్యాపించిన మేఘాలు వర్షించి నిర్మలంగా ఉన్న ఆకాశంలాగుంది సుశీల మనస్సు. రాధను గురించి చిత్రించుకొన్న రూపాన్ని చెరిపివేయటానికి అవస్థ పడుతున్నాడు కుటుంబం.